క్లుప్తంగా

జయప్రకాష్‌ను కలిసిన గుడిదేశి



జేపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న శ్రీనివాసరావు

ఏలూరు (టూటౌన్‌): వైఎస్సార్‌ సీపీ ఏలూరు నగర అధ్యక్షుడిగా నియమితుడైన గుడిదేశి శ్రీనివాసు ఆ పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయ ప్రకాష్‌ (జేపీ)ని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. సమష్టిగా పనిచేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలి జేపీ శ్రీనివాసుకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులు జాన్‌ గురునాథ్‌, పార్టీ, యూత్‌ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

జయప్రకాష్‌ పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జయప్రకాష్‌

ఏలూరు (టూటౌన్‌): వైఎస్సార్‌ సీపీ పోణంగి నేత నాయకులు దుంపల స్వామి తల్లి శనివారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని వైఎస్సార్‌ సీపీ ఏలూరు ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్‌ (జేపీ) సందర్శించి నివాళులర్పించారు. స్వామి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జేపీ వెంట మాజీ డిప్యూటీ మేయర్‌ గుడిదేశి శ్రీనివాస్‌, ఎస్సీ నాయకులు జాన్‌ గుర్నాథ్‌, బంకూరు వెంకట్‌, స్థానిక నేతలు ఉన్నారు.

108 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్‌ కృష్ణ

ఏలూరు (టూటౌన్‌): స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని శ్రీ కృష్ణ ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 108 రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి డాక్టర్‌ బి.కృష్ణ మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రతి నెలా రెండో శనివారం తమ ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రక్త పరీక్షలు, బీఎండీ (ఎముకల సాంద్రత), స్కానింగ్‌, ఎక్స్‌రే పరీక్షలు ఉచితంగా చేస్తామని, అవసరమైన మందులను అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, ల్యాబ్‌టెక్నికల్‌ సిబ్బంది, నర్సులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోవాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వివిధ కారణాలతో సస్పెండ్‌ అయిన ఉపాధ్యాయులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మను కోరారు. నిజనిర్ధారణ కమిటీ నివేదికను త్వరితగతిన తెప్పించుకొని సంబంధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, ఈలోపు మానవతా దృక్పథంతో వారిని విధుల్లోకి తీసుకోవాలని పేర్కొన్నారు. పీఆర్‌టీయూ నేత ఎం రాంబాబు పాల్గొన్నారు.

లిక్కర్‌ షాపుల ఇష్టారాజ్యం

- ఏలూరులో అనధికార పర్మిట్‌లు
- నివాసిత ప్రాంతాల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు
- మందుబాబుల వీరంగంతో భయంభయం



ఏలూరు వన్‌టౌన్‌లోని నివాసిత ప్రాంతాల్లో అనధికార పర్మిట్‌ ప్రాంతాలు



వన్‌టౌన్‌లో దుకాణంలో మద్యం లూజు విక్రయాలు

ఏలూరు టౌన్‌: కూటమి సర్కారులో మద్యం ఏరులై పారుతోంది. ఏలూరు నియోజకవర్గంలోని నివాసిత ప్రాంతాల్లో లిక్కర్‌ దుకాణాలు ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసి రాత్రీ పగలూ తేడా లేకుండా మద్యం విక్రయిస్తున్నారు. దీంతో మందుబాబుల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. ఇంత జరుగుతున్నా ఆబ్కారీ శాఖ అధికారులు చోద్యం చూడడం మినహా నిబంధనలు అమలు చేయలేని దైన్యస్థితిలో ఉన్నారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

నివాసిత ప్రాంతాల్లోనే సిట్టింగ్‌

ఏలూరు నగరంలో మద్యం దుకాణాల యాజమాన్యాలు విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు. ఏలూరు నగరంలో 21 ప్రైవేటు మద్యం దుకాణాలు ఉండగా.. బెల్టు షాపులకు కొదవేలేదు. తాము పెట్టిన పెట్టుబడులను రాబట్టేందుకు 24 గంటలూ మద్యం అమ్మకాలు చేసేందుకు వెనుకాడడంలేదు. మద్యం సేల్స్‌ అనంతరం ప్రభుత్వం ఇవ్వాల్సిన సొమ్ముల శాతం తక్కువగా ఉండటంతో లిక్కర్‌ సేల్స్‌ను భారీగా పెంచుకునేందుకు ఆదాయ మార్గాలు వెతుక్కుంటున్నారు. ఏలూరు వన్‌టౌన్‌ ప్రాంతంలోని పంపుల చెరువు వద్ద ఒక మద్యం షాపు నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ దుకాణం పక్కనే మందుబాబులకు సిట్టింగ్‌ ఏర్పాటు చేయటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పటంలేదంటున్నారు.

మందుబాబుల వీరంగం

రాత్రి వేళల్లో పూటుగా మద్యం సేవిస్తున్న మందుబాబులు తమ ఇళ్ల ముందు మూత్ర విసర్జనలు చేయటం, గుట్కాలు నమిలి ఉమ్మివేయటంతో ఉదయం లేచేసరికి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. పూటుగా మద్యం తాగి అరుపులు కేకలు, గొడవలతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, మద్యం ఖాళీ సీసాలను సైతం ఇళ్ల వద్ద, రోడ్లపై పగలుగొడుతూ రచ్చ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నేతల అండదండలతో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయటంతో మందుబాబుల ఆగడాలను అడ్డుకునే పరిస్థితి లేదంటున్నారు.

మహిళలు, బాలికలకు ఇబ్బందులు

ఏలూరు నగరంలోని వన్‌టౌన్‌, టూటౌన్‌, రూరల్‌ ప్రాంతాల్లో మద్యం దుకాణాల వద్ద లూజు సేల్స్‌ భారీగా చేస్తున్నారు. మద్యం దుకాణం వద్ద లిక్కర్‌ కొనుగోలు చేసి అక్కడే తాగుతూ రోడ్డుపైనే చిందులేస్తుండడంతో మహిళలు, బాలికలు, విద్యార్థినులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అనధికారికంగా టేబుల్స్‌, కుర్చీలు వేసి సిట్టింగ్‌ ఇవ్వటంతో మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. మద్యం మత్తులో అటుగా వెళ్లే బాలికలు, మహిళలను టీజ్‌ చేసినా, ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావటంలేదని, పోలీసులకు ఫిర్యాదు చేస్తే తమపై దాడులు చేస్తారనే భయంతో ఉంటున్నామని వారంతా వాపోతున్నారు.

చర్యలు చేపడతాం



ఏలూరు నియోజకవర్గంలోనే కాదు, జిల్లాలో ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు, సిట్టింగ్‌ ఇస్తే చర్యలు చేపడతాం. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు. మద్యం దుకాణాల వద్ద మద్యం తాగేవారికి సిట్టింగ్‌ ఇచ్చినట్టు మాకు ఫిర్యాదు వచ్చినా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లిక్కర్‌ సేల్స్‌ చేసినా చర్యలు తప్పవు. ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తాం.

– అవులయ్య, ఎక్సైజ్‌ శాఖ జిల్లా అధికారి

కోడి పందేల బరులు ధ్వంసం



చేబ్రోలులో బరులను ధ్వంసం చేయిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌

ఏలూరు టౌన్‌: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు, జూదాలను అడ్డుకునేందుకు చర్యలు చేపట్టారు. కోడిపందేలు వద్దు.. సంప్రదాయ క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం ఉంటుందని గ్రామాల్లోని యువతకు క్రీడాపోటీలు నిర్వహించటంతోపాటు, బ్యానర్లు, ఫ్లెక్సీలతో అవగాహన కల్పిస్తున్నారు. కోడిపందాలు, జూదం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌ హెచ్చరిస్తున్నారు. గ్రామాల్లో కోడిపందేల బరులను ధ్వంసం చేస్తున్నారు. ఏలూరు పోలీస్‌ సబ్‌డివిజన్‌ పరిధిలోని గణపవరం, నిడమర్రు, చేబ్రోలు పోలీస్‌ స్టేషన్ల పరిధిలో ముందుస్తుగా 320మందిపై బైండొవర్‌ కేసులు నమోదు చేశారు. 11 కోడిపందేల బరులను ధ్వంసం చేశారు. ఏలూరు వన్‌టౌన్‌, రూరల్‌ ప్రాంతాల్లో కోడి పందేల బరులను ధ్వంసం చేయిస్తున్నారు.

అమిత్‌ షాను తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్‌ ఐఆర్‌ఎస్‌ అధికారి సంజీవ్‌

ఏలూరు (టూటౌన్‌): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ను పార్లమెంట్‌ సాక్షిగా అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను తొలగించాలని కేవీపీఎస్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌ టేబుల్‌ సమావేశం డిమాండ్‌ చేసింది. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కేవీపీఎస్‌ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్‌ అధ్యక్షతన శనివారం రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్‌ ఐఆర్‌ఎస్‌ అధికారి చాగంటి సంజీవ్‌ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మతాలను రెచ్చగొట్టే ఆలోచనలు తీసుకొచ్చి ప్రజల్ని చీల్చే ఆలోచన చేస్తుందని విమర్శించారు. కేవీపీఎస్‌ ఏలూరు జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్‌ మాట్లాడుతూ కేంద్రం సనాతన ధర్మం పేరుతో మనువాదాన్ని, మతపరమైన మనోభావాలను రెచ్చగొడుతుందని తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్‌ మాట్లాడుతూ కార్మిక చట్టాల్ని బీజేపీ అధికారంలోకి వచ్చాక పూర్తిగా మార్చారని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బండి వెంకటేశ్వర రావు, కాపుదాసు రవికుమార్‌, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌, మున్సిపల్‌ వర్కర్‌ నాయకులు బి.సోమయ్య, ఎరుకుపాటి విజయ్‌, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి లెనిన్‌, కె.విజయలక్ష్మి, ఎ.ఆనంద్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దత్తనాథ క్షేత్రంలో మహాయాగం



యాగం కరపత్రం విడుదల చేసిన క్షేత్రం ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక దొండపాడులోని శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో ఆదివారం నుంచి ద్విపుష్కర సంప్రోక్షణ మహాయాగం నిర్వహించనున్నట్లు క్షేత్రం వ్యవస్థాపక ట్రస్టీ వేణుగోపాల్‌ లునాని తెలిపారు. ఈ మేరకు కరపత్రాన్ని శనివారం స్థానిక దత్త క్షేత్రంలో ఆయన విడుదల చేశారు. దత్తక్షేత్రం ఏర్పాటు చేసి 24 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయ సంప్రోక్షణ నిమిత్తం వివిధ యాగాలు, హోమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 12 నుంచి 15 వరకు మైసూరు అధ్యాపకులు ఉదయం ఉచిత క్రియాయోగ తరగతులు నిర్వహిస్తారన్నారు. అవధూత దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఈ నెల 13న మహాయాగ కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. 13న ఉదయం రుద్రయాగం, సాయంత్రం పూర్ణాహుతి, 14న ఉదయం ఆయుష్య హోమం, శ్రీచక్రపూజ, మైసూరు దత్తపీఠ ఉత్తరాధికారి శ్రీ దత్త విజయానంద తీర్థస్వామీజీ గణపతి సచ్చిదానంద స్వామీజీకి గురుపూజ, కూష్మాండ దానాలు చేస్తారని వివరించారు. 15న ఉదయం పూజలు, అభిషేకాల అనంతరం స్వామీజీ దర్శనం, సాయంత్రం వేణునాద రాగ సాగర కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సమావేశంలో దత్తక్షేత్రం కమిటీ సభ్యులు కాకి వెంకట స్వామి బాబు, శానం విజయమోహనరావు, శానం ప్రసాద రావు పాల్గొన్నారు.



ఏలూరు ఇంజనీరింగ్‌ కళాశాలలో భోగిమంటలు



సాంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు

సంప్రదాయ సంబరం

సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు సందడి చేశారు. రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి నృత్యాలు చేశారు. భోగి మంట చుట్టూ ప్రదక్షిణ చేసి అలరించారు. పట్టు పరికిణీలు, పంచె కట్టులతో ఇలా సంప్రదాయం ఉట్టిపడేలా జిల్లాలోని వివిధ కళాశాలల్లో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. హరిదాసుల వేషధారణ, డూడూ బసవన్నలు ఆకర్షణగా నిలిచాయి. ఏలూరు ఇంజినీరింగ్‌ కళాశాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి.

– సాక్షి ఫొటో గ్రాఫర్‌ /ఏలూరు



బొమ్మల కొలువు పెడుతూ



ఉత్సాహంగా నృత్యాలు చేస్తున్న విద్యార్థినిలు



బసవన్నతో సెల్ఫీ

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



డీఎన్నార్‌కు బొకె ఇచ్చి కృతజ్ఞతలు తెలుపుతున్న శ్రీనివాసరావు

ఏలూరు (టూటౌన్‌): జిల్లాలో వైఎస్సార్‌ సీపీ బలోపేతానికి కలిసికట్టుగా పని చేద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. ఏలూరు నగర అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన గుడిదేశి శ్రీనివాస్‌ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్‌ (జేపీ)తో కలిసి శనివారం కైకలూరులో నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్‌ జగన్‌ను తిరిగి సీఎం పీఠంపైన కూర్చోబెట్టేందుకు పనిచేయాలని డీఎన్నార్‌ సూచించారు. కార్యకర్తలకు పార్టీ అధినాయకత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ, యువజన నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు చొక్కాల పంపిణీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన లింగి శెట్టి హెల్పింగ్‌ హ్యాండ్స్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో నగరంలోని ఏడు ఫోరీల సెంటర్‌ వద్ద 100 మంది ఆటో డ్రైవర్లకు శుక్రవారం ఖాకీ చొక్కాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ చైర్మన్‌ లింగిశెట్టి శశి కుమార్‌, సత్యవాణి శ్రీలు మాట్లాడుతూ ఏడు ఫోరీల సెంటర్‌లో ఐక్య ఆటో యూనియన్‌ గౌరవ అధ్యక్షులుగా ఉన్న తాను సంక్రాంతి సందర్భంగా ఆటోడ్రైవర్లకు అండగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. 2010లో తన తల్లిదండ్రుల మరణానంతరం ఈ ట్రస్ట్‌ ఏర్పాటు చేసి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో స్టాండ్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ శంకరరావు సెక్రటరీ డీఎన్‌ బాబు, బాబా యాడ్స్‌ అధినేత బాబా, గోగుల కనకారావు, గంగాధర రావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో వ్యాధులకు మంచి పరిష్కారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఆయుర్వేద వైద్యంలో ప్రతి వ్యాధికీ మంచి పరిష్కారం దొరుకుతుందని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు నగేష్‌ తెలిపారు. శనివారం రామకోటి ప్రాంగణంలో లయన్స్‌ క్లబ్‌ ప్రతినిధి మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో ఆయన బృందం 102 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

నేడు రచయితల సంఘం వార్షికోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా రచయితల సంఘం 5వ వార్షికోత్సవ కార్యక్రమం స్థానిక రామకృష్ణాపురం సాహిత్య మండలి హాల్‌లో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమవుతుందని ఆ సంఘ అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సాహిత్య, కళా రంగాల్లో విశేష కృషి చేసిన ప్రతిభామూర్తులకు సాహిత్య, కళా పురస్కారాల కింద రూ.5 వేలు చొప్పున నగదు, మెమెంటోలను అందజేస్తామని పేర్కొన్నారు. మణిమేల శివ శంకర్‌కు కావలి బొర్రయ్య స్మారక, కేఎస్‌ మల్లీశ్వరికి బుచ్చిబాబు స్మారక నవల, ఉపాధ్యాయులు రామారావుకు బొడ్డు బాపిరాజు స్మారక, పార్వతీ రామచంద్రన్‌కు కోరాడ నరసింహారావు స్మారక పురస్కారాలను అందజేయనున్నట్టు తెలిపారు.